క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి



గుడివాడరూరల్: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులు, సిబ్బందిని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ బుధవారం పలు సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. తొలుత పోలింగ్ సామగ్రిని అధికారులకు పంపిణీ చేశారు. పోలింగ్ సమయంలో అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ కట్టా రామశివ, ఆర్ఐ నాగబాబు, డివిజన్‌లోని పోలింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ మరమ్మతు పనులు

మండవల్లి: మండవల్లిలోని కైకలూరు వీధిలో సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో బుధవారం డ్రెయినేజీ మరమ్మతులు నిర్వహించారు. డ్రెయినేజీ సక్రమంగా ఉండటానికి తూములు ఏర్పాటు చేసి నీరు డ్రెయిన్ ద్వారా వెళ్లే విధంగా సర్పంచ్ చర్యలు తీసుకున్నారు. మెండా సురేష్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల అభివృద్ధికి అంచనాలు

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి తక్షణం డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఆదేశాలతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ(మోర్త్) అధికారులు పట్టణంలో బుధవారం కార్యాచరణ ప్రారంభించారు. జాతీయ రహదారుల సంస్థ డీఈఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్రల నేతృత్వంలో సిబ్బంది నెహ్రూచౌక్ మీదుగా వీకేఆర్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల వరకు కొలతలు తీశారు. వీధి దీపాలు, రెండు వైపులా డ్రెయిన్లు, వాటిపై టైల్స్ తదితరాల నిర్మాణానికి అంచనాలు రూపొందించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

మొవ్వ: వచ్చే నెల ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రధానాచార్యులు డి.సుధాకర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ బి.గంగాధర్ (పెడన) తెలిపారు. కళాశాల్లో మొదటి సంవత్సరం పరీక్షలకు సంబంధించి జనరల్ గ్రూప్ విద్యార్థులు109, వృత్తి విద్యా కోర్సులకు 79 మంది, రెండో సంవత్సరానికి జనరల్ కోర్సు విద్యార్థులు 93, వృత్తి విద్యా కోర్సులకు 45 మంది ఉన్నారని పేర్కొన్నారు. అలాగే ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ప్లస్ టు (ఇంటర్మీడియట్ బాలికలు) రెండు గ్రూపులకు కలిసి ఏడుగురు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

డ్వాక్రా వస్తువుల కొనుగోలుకు ఆన్‌లైన్ పద్ధతి



గుడివాడరూరల్: డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులను కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్ పద్ధతి అమలు చేసి ప్రోత్సహిస్తున్నట్లు మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) బసవేశ్వరరావు తెలిపారు. స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో మెప్మా ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే యాప్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి వారి చేతిలో ఫోన్ ఉండటంతో నేడు ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ ద్వారానే అనేక వస్తువుల క్రయ, విక్రయాలు చేస్తున్నారన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వయం సహాయక మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఓలు, ఆర్పీలు, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

హర హర మహాదేవ..శంభో శంకర

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలు శివ నామస్మరణతో పులకించాయి. బుధవారం వేకువజామునే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూల్లో బారులు తీరారు. పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

శివ నామస్మరణతో పులకించిన ఆలయాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ సిద్ధేశ్వరాలయం, కౌతవరం గౌతమేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు అంబా గౌతమేశ్వరరావు అర్చక బృందం బుధవారం స్వామికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. వేమవరంలో శ్రీ నాగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రుద్రపాక లక్ష్మీ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విశేషాభిషేకాలను నిర్వహించారు. గుడ్లవల్లేరు శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి పంచాయన క్షేత్రంలో నగరేశ్వరాలయం, అంగలూరు అమరేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఐలూరుకు పోటెత్తిన భక్తులు

తోట్లవల్లూరు: శివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మండలంలోని ఐలూరు గ్రామం మార్మోగింది. పుణ్యస్నానాల కోసం అశేషంగా తరలివచ్చిన భక్తజనంతో కృష్ణానది తీరం పోటెత్తింది. దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.కృష్ణానదిలో పుణ్యస్నానాల అనంతరం భక్తులు రామేశ్వరస్వామిని, పక్కనే ఉన్న రఘునాయకస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పమిడిముక్కల సీఐ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ అవినాష్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ రవికాంత్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, ఆలయ మేనేజర్ శివగోపాలరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రామేశ్వరస్వామిని దర్శించుకున్న కైలే..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రామేశ్వరస్వామిని, రఘునాయకస్వామిని దర్శించుకున్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, మండవల్లి, భైరవపట్నం, శోభనాద్రిపురం, చావలిపాడు, లోకుమూడి ఆలయాల్లో బుధవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు గూడూరు భవానీశంకర్ ఆధ్వర్యంలో శివరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.



ఐలూరులో జల్లుస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కౌతవరంలో గౌతమేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

జల్లుస్నానాలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు పుష్కరఘాట్ వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షవర్ల కింద భక్తులు జల్లుస్నానాలు ఆచరించారు. స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు తమ్మన ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ జరిగింది. ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పామర్రులో సోమేశ్వరస్వామికి పూజలు

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురజ శ్రీరామలింగేశ్వరస్వామి పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి చినకామనపూడి మహంకాళేశ్వర స్వామి పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి వడాలి శివాలయంలో భక్తులు తెల్లవారు జాము నుంచి పోటెత్తారు. సింగరాయపాలెం శ్రీఅమతేశ్వరస్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



మండవల్లిలో మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకుడు



భోగేశ్వరలంకలో బారులు తీరిన భక్తులు

పామర్రులో..

పామర్రు: శివరాత్రి సందర్భంగా పామర్రు శివాలయంలో బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడి మొదలైంది. స్వామికి పంచామృతాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు లంకా భీష్మకుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించామని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రాపర్ల గ్రామంలో గణ్యశ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వరస్వామికి, అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలందరికీ శివుడి ఆశీస్సులు



స్వామివారి పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలోని ప్రజలందరికీ పరమ శివుడు ఆశీస్సులుండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. పట్టణంలోని భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే రాము మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయం వద్ద పవిత్ర కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

ఘనంగా ఆది దంపతుల కల్యాణోత్సవం

పామర్రు: గంగాపార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత సాయంత్రం స్వామివారిని పెండ్లి కూమారుడిగా పార్వతీ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. రాత్రి 8.01 గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంటీడీ నాగేశ్వరరావు కల్యాణ మంత్రాలను పఠిస్తూ వాటికి అర్థాలను భక్తులకు వివరించారు. ఆలయ అర్చకులు లంకా భీష్మకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు.



పామర్రులో శివపార్వతుల కల్యాణం

భం భం భోలే భోగేశ్వర..!

కైకలూరు: శివ నామస్మరణతో నియోజకవర్గంలో శైవక్షేత్రాలు మార్మోగాయి. శివరాత్రి సందర్భంగా కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి బుధవారం లక్షపైనే భక్తులు విచ్చేశారు. పంచబుగ్గల కోనేరులో స్నానాలాచరించి భక్తులు క్యూలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, కర్రసాము, కలిదిండి, గుర్వాయిపాలేనికి చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరభద్రపళ్లెం కార్యక్రమం ఆకట్టుకుంది. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సీఐ వి.రవికుమార్ సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. పలు సామాజిక వర్గాల వారికి ఉచిత భోజనాలు అందించారు. దేవదాయ శాఖ గుడివాడ తనిఖీ అధికారి వి.సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ కుమారుడు దూలం వినయ్, కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు సమయం అంజి, పంజా రామారావు, నాగు, వివేకానంద, భాస్కర్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.



పాతాళ భోగేశ్వరస్వామిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కలిదిండి భోగేశ్వలంకలో భక్తులతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఆటపాకలో..

కైకలూరు మండలం ఆటపాక కనకలింగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి దివ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకవార అభిషేకాలు నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు బందా వెంకటరమణయ్య, సత్యనారాయణ, బీవీవీఎస్ నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు



తోట్లవల్లూరు పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కుసుమకుమారి

గుడ్లవల్లేరు: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు గురువారం జరగనున్నాయని తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గుడ్లవల్లేరు మండలంలో 1,483 పట్టభద్రులకు సంబంధించిన ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ల స్లిప్పులను బీఎల్‌వోల ద్వారా ఓటు హక్కువ ఉన్న ప్రతి ఒక్కరికి అందించామన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 1,287 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఎన్నికకు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో రెండు బూత్‌లు ఏర్పాటు చేశామని తహసీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు.

పామర్రులో..

పామర్రు: పామర్రు హైస్కూల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో గురువారం జరగబోయే ఎన్నికలకు మొత్తం 1,766 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈ విషయంపై బుధవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జీ రవికాంత్ మాట్లాడుతూ పోలింగ్ ఉదయం ఎనిమిది నుంచి సాయింత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని తెలిపారు. వైద్య, విద్యుత్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.



గుడ్లవల్లేరులో కేంద్రాలకు వచ్చిన సిబ్బంది

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎం. కుసుమకుమారి తెలిపారు. స్థానిక జెడ్పీ పాఠశాల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను బుధవారం ఆమె పరిశీలించారు. మండల వ్యాప్తంగా 1,312 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎంఈఓ సురేష్, వీఆర్ఓ నాంచారయ్య పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు.. కోతులు

- ఇళ్లల్లోకి చొరబడుతున్న వానరాలు
- కుక్కల స్వైర విహారంతో ప్రజల ఆందోళన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో కోతులు, కొండముచ్చులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లాలంటే ధైర్యం చేయలేకపోతున్నారు. కోతులు, కుక్కలను నియంత్రణ చేయని పక్షంలో రోడ్ల వెంట నడవాలంటేనే కష్టంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ద్వారా కుక్కలను పట్టించి బయటకు తీసుకెళ్లి దూరంగా వదులుతున్నా...అవి మళ్లీ యథాతథంగా ఈ ప్రాంతాన్ని గుర్తు పెట్టుకుని వచ్చేస్తున్నాయి. ఈ కుక్కల బెడదను తగ్గించకపోతే చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలకు నిత్యం ప్రమాదాలు తప్పవని స్థానికులు వాపోతున్నారు. కోతులు, కొండ ముచ్చులు వందల సంఖ్యలో ఉంటే గాని వేటగాళ్లు రంగంలోకి దిగటం లేదు. వీటిపై ఎలాంటి నియంత్రణ లేకపోవటంతో గుంపులు గుంపులుగా అధిక సంఖ్యలో వచ్చి ఇళ్లలో చొరబడిపోతున్నాయి. చేతికి దొరికిన వస్తువులతో పాటు నిత్యావసరాలు, సామాన్లను పాడు చేస్తున్నాయి. భవనాలు, షోకేస్‌లు, దుకాణాలకు ఉండే ఖరీదైన అద్దాలను పగలగొడుతున్నాయి. వీటికి ఎదురైన వారిని కొరికేస్తున్నాయి. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఒకేచోట చేరిన వానరాలు



గుడ్లవల్లేరులో కుక్కల స్వైర విహారం



వానరాల దాడికి భయపడి ఒక భవనం పై అంతస్తుకు మెస్‌ను ఏర్పాటు చేసుకున్న యజమాని

షాపు అద్దాలు పగలగొట్టేసింది



మా షాపుకు అలంకరించిన ఖరీదైన అద్దాలను కొండముచ్చు వచ్చి పగలకొట్టేసింది. అది వచ్చేసరికి మా కుర్రోళ్లు భయాందోళనలతో పరుగులు తీయటమే జరిగింది. కాని అది మా జ్యూస్ షాపులో ఉన్న చేతికి అందిన వస్తువులను పాడు చేసింది. అక్కడే ఉన్న రూ.10వేల విలువైన అద్దాన్ని బద్దలు కొట్టేసింది.

– కె.మధుశ్రీ, హెల్త్ గురూ షాపు యజమాని

చాలా ఇబ్బందిగా ఉంది



కొండముచ్చులు, కోతులతో కంటి మీద కునుకు ఉండటం లేదు. మందలకు మందలు వచ్చేసి ఇళ్లపై పడిపోతున్నాయి. ఏం చేయలేని పరిస్థితి. ఆ గుంపుల మందను తోలుదామంటే కరిచేందుకు మీదకు వచ్చి పడిపోతున్నాయి. వృద్ధులు, చిన్నారులు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– అట్లూరి దిలీప్‌కుమార్, గ్రామస్తుడు

అదుపు చేసేందుకు చర్యలు



కుక్కలు, కోతులు, కొండముచ్చులతో గ్రామాల్లో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. వాటిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కోతులు, కొండముచ్చులు పట్టే వేటగాళ్లను తీసుకొచ్చాం. కుక్కలను చంపితే నేరమని వాటిని కూడా పట్టించి దూరంగా వదిలేందుకు ప్రయత్నిస్తున్నాం.

– నరసింహారావు, గ్రామ కార్యదర్శి, గుడ్లవల్లేరు

పుష్కరఘాట్ పూడ్చివేతపై మాజీ ఎమ్మెల్యే కైలే ఆగ్రహం

తోట్లవల్లూరు: ఐలూరు వద్ద కృష్ణానది తీరాన ఉన్న పుష్కరఘాట్‌ను పూడ్చేయటం అన్యాయమని, భక్తులు ఫిర్యాదు చేసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామేశ్వర స్వామి దర్శనానికి బుధవారం విచ్చేసిన ఆయనకు పలువురు భక్తులు పుష్కరఘాట్ పూడ్చేసిన విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌కుమార్ గ్రామస్తులతో కలిసి పుష్కరఘాట్‌ను పరిశీలించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఘాట్ పూడ్చేసి, రహదారి నిర్మించటం మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. ఎవరో స్వార్థ ప్రయోజనాల కోసం ఘాట్‌ను పూడ్చేస్తే ఎలా ఊరుకుంటారని తహసీల్దార్ కుసుమకుమారిని ఫోన్లో ప్రశ్నించారు. పూడ్చేసిన పుష్కరఘాట్‌ను వెంటనే పునరుద్ధరించకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని అనిల్‌కుమార్ అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు ఉదయ్‌భాస్కర్, రమేష్, నాయకులు గవాస్కర్‌రాజు, నాగరాజు, నాగార్జున పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు